ప్రజాశక్తి

శనివారం 2 ఆగస్టు 2025

5

అల్లూరి సీతారామరాజు

పాఠశాలలో తనిఖీలు

విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఎంఇఒ

ప్రజాశక్తి-జిమాడుగుల: విద్యార్థులు చదువుల్లో రాణించాలని మండల విద్యాశాఖాధికారి బాబూరావు తెలిపారు. జి.మాడుగుల మండలం గెమ్మెలి పంచాయతీ మద్దులబంద ఎంపీపీ పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలపై ఆరా తీశారు. విద్యార్థులతో చదివించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరకు డీలర్ షాపు వద్ద గుమిగూడి ఉన్న గిరి రైతులు

ఎరువుల కోసం గిరి రైతుల పాట్లు

▶▶ ప్రయివేటు డీలర్ షాపు వద్ద బారులు ▶▶ గంటల తరబడి నిరీక్షణ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో రైతులకు ఎరువులు లేకపోవడంతో వాటికోసం పలు పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి సచివాలయాల పరిధిలో ఎరువులు పంపిణీ చేసినప్పటికీ అవి సరిపోక పోవడంతో ప్రైవేట్ డీలర్లను ఆశ్రయిస్తున్నారు.

మండల వ్యాప్తంగా 18 పంచాయతీలు ఉండగా అరకులో ఒకరే డీలర్ ఉన్నారు. ఒకేసారి ఎక్కువమంది కొనుగోలు చేయడానికి వెళితే రద్దీ ఏర్పడుతుండడంతో రైతులు బారులు తీరి ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక మండలంలో ప్రతి శుక్రవారం వారపు సంత జరుగుతుంది. వారపు సంతకు వివిధ అటవీ ఉత్పత్తులు విక్రయించడానికి వచ్చి అదే సమయంలో ఎరువులను కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. దీంతో, ఒకేసారి ఎక్కువమంది రైతులు డీలర్ షాపుకు వెళ్తుండటంతో రద్దీ ఏర్పడడంతో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు రైతులు అంటున్నారు. శుక్రవారం మారుమూల గ్రామాల నుంచి అరకు వారపు సంతలోని డీలర్ షాపులో ఎరువులు కొనడానికి అధిక సంఖ్యలో రైతులు రావడంతో డీలర్ షాప్ రద్దీ ఏర్పడింది. మారుమూల పంచాయతీ గ్రామాల గిరిజనులు సుమారు 40 నుంచి 50 కిలోమీటర్ల దూరం నుంచి అక్కడికి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్లడానికి వాహనాల్లో లగేజి చార్జీలు భరించుకోలేక ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి అన్ని పంచాయతీ కేంద్రాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

శతశాతం రిజర్వేషన్‌పై సిఎం ప్రకటన చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం నేతల డిమాండ్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ప్రపంచ ఆదివాసీ వారోత్స వాలను జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ కోరారు. మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో ప్రపంచ ఆదివాసీ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసి జెండాను అవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీ స్పెషల్ డీఎస్సిలో ఆదివాసులకు వంద శాతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్‌ను కల్పించే విధంగా ఈనెల 9 న ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు గిరిజన హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామూర్తి, ప్రసాద్, సి ఇ.మహాదేవ్, వి.సురేషకుమార్, టి.ప్రభాస్ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు, గిరిజనులు

వినతుల పరిష్కారానికి చొరవ చూపించండి

-జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్- పిజిఆర్ఎస్‌కు 81 అర్జీలు

వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: వినతుల పరిష్కారానికి అధికారుల చొరవ చూపాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ్ సూచించారు. ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, డిఆర్ఓ కె.పద్మలత సంయుక్తంగా వినతులు స్వీకరించారు. తాగునీటి, రహదారులు, సిసి రోడ్లు, డ్రైనేజీలు, అటవీ హక్కు పత్రాలు, రోడ్డు విస్తర్ణలో దుకాణాలు నష్టపోయి దుకాణాలకు ప్రత్యామ్నాయంగా భూములు కేటాయింపుపై అర్జీదారుల నుండి 81 వినతులు స్వీకరించారు. అర్జీదారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు. అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని, తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని..

హుకుంపేట మండలం మత్స్యపురం పంచాయతీ సెంబి గ్రామానికి చెందిన కొర్రా బొంజుబాబు, పి.చిరంజీవి బురదమామిడి నుండి సెంబి గ్రామం వరకు రోడ్డు వేయించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. కొయ్యూరు మండలం కోమ్మిక పంచాయతీ డేగలపాలెం గ్రామానికి చెందిన డి.సత్యనారాయణ, డి.గురువులు, డి.రాంబాబు వ్యవసాయ నిమిత్తం విద్యుత్ లైన్ ఇప్పించవలసిందిగా కోరుతూ వినతి పత్రం సమర్పించారు. చింతపల్లి మండలం చింతపల్లి గ్రామనివాసి కె.శ్రీనివాసరావు తదితరులు తొలగించిన గిరిజనుల దుకాణాలను వేరొక స్థలములో నిర్మించుకునేందుకు అనుమతివ్వాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన కె.బాలాజీ తదితరులు బోడిదేవులపల్లి గ్రామం గుడి నుండి పోకలపాలెం గ్రామం వరకు తారురోడ్డు కోరుతూ వినతి పత్రం సమర్పించారు. హుకుంపేట మండలం తాడిపూడి పంచాయతీ నిమ్మలపాడు గ్రామానికి చెందిన రేగం రామన్న వికలాంగుల పెన్షన్ మంజూరు కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ డిసి ఎంవిఎస్ లోకేశ్వరరావు, డిపిఒ కెపి చంద్ర శేఖర్, ల్యాండ్ సర్వే రికార్డ్స్ సహాయ సంచాలకులు కె.దేవేంద్రుడు, ముఖ్య ప్రణాళిక అధికారి పివిఎల్ ప్రసాద్, డిఇఒ పి.బ్రహ్మాజీ, జిల్లా ఖాజా అధికారి ప్రసాద్ బాబు, ఎస్ టిఒ కృపారావు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

ఎంఇఒ 1 పోస్టులను భర్తీ చేయాలని..

ప్రజాశక్తి-చింతపల్లి: రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ-1) పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని పిఆర్టియు అల్లూరి జిల్లా అధ్యక్షులు ఉగ్రంగి వెంకటగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా పరిషత్ పాఠశాలల వద్ద ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ; రాష్ట్రంలోని ఎంఈఓ-1 ఖాళీలను కేవలం ప్రభుత్వ మేనేజ్మెంట్ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లను ఫ్యాక్ట్‌చార్జ్ హెూదాలో నియమించడం ఏకపక్ష నిర్ణయమన్నారు. ఇది సర్వీసు నియమావళులకు విరుద్ధమని, ఒకే డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులందరికీ కామన్ సీనియారిటీ ప్రాతిపదికన సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా, కొన్ని విభాగాల్లో అధికారులు వాటికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు మాత్రమే మండల విద్యాశాఖ పోస్టులకు అర్హులని భావించి, పంచాయతీరాజ్ పాఠశాలల సీనియర్ ఉపాధ్యాయులను విస్మరించడం తీవ్ర నిరాశకు గురి చేస్తోందన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల ఉపాధ్యాయుల మధ్య వివక్ష లేకుండా, కామన్ సీనియారిటీ ప్రాతిపదికన మండల విద్యాశాఖాధికారుల నియామకాన్ని చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పిఆర్‌టీయూ నాయకులు ఎం.అప్పారావు, గిడ్డి వరలక్ష్మి, రోబ్బ వెంకటరమణమ్మ, కిముడు దామోదరం, సరమండ తిలక్, సత్తిబాబు, గెమ్మెలి కామేష్ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

ఆదివాసీ ఉద్యోగాల రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలి

- ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సీసం సురేష్
- కోయ్‌త్తోర్ పండూందక్కట్ కూనవరాన్ని జయప్రదం చేయాలి
- గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్
- పలు గ్రామాల్లో ఆదివాసీ దినోత్సవ జెండా ఆవిష్కరణలు

కూనవరంలో మాట్లాడుతున్న గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్

చింతూరులో జెండా ఆవిష్కరిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి - చింతూరు : ఆదివాసీలకు శతశాతం ఉద్యోగ రిజర్వేషన్ ఎన్నికల హామీని అమలు చేయాలని ఆదివాసీ సంఘ రాష్ట్ర నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో చింతూరు ఎర్రంపేట, మల్లెతోట, మధుగురు, లక్కవరం గ్రామాల్లో ముందస్తు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జెండా ఆవిష్కరణ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసం సురేష్, మండల నాయకులు కారం నాగేష్, మడకం చిన్నయ్య, కారం సుబ్బారావు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం ఫలితంగానే జిఒ నంబర్ 3ని సుప్రీంకోర్టు కొట్టి వేసిందన్నారు. ఆగస్టు 9న కోయ్‌తోర్ పండుం దక్కూడ్ కూనవరం కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధర్మల్ వీరభద్రం, ధర్ముల మల్లయ్య, మడకం సీతమ్మ, కారం కొండయ్య, పాండు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కూనవరం : ఆగస్టు 9వ తేదీన కూనవరం మండల కేంద్రంలో జరిగే భారీ బహిరంగసభను జయప్రదం చేయాలని కోరుతూ రేగులపాడులో ప్రజలకు వివరిస్తూ ఆదివాసీ గిరిజన సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులిసంతోష్‌కుమార్, జిల్లా నాయకులు పాయం సీతారామయ్య, మండల నాయకులు బాబు బోర్రయ్య, సర్పంచ్ బొగ్గ రామారావు, సర్పంచ్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : కోయ్‌త్తోర్ పండూందక్కట్ కూనవరం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మండల కార్యదర్శి పూనం ప్రదీప్‌కుమార్, కారం సుందరయ్య, పులి బొజ్జీలు పిలుపునిచ్చారు. సున్నంవారిగూడెంలో విద్యార్థులతో మాట్లాడుతూ కనుమరుగవుతున్న ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. కారం సత్తిబాబు, పండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సున్నంవారిగూడెంలో మాట్లాడుతున్న పూనెం ప్రదీప్‌కుమార్

'ప్రభుత్వ ఉద్యోగులు' అనే పదాన్ని సాధికార సర్వేలో తొలగించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రాష్ట్రప్రభుత్వం సాధికార సర్వేలో అంగన్వాడి వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడం వలన అతి తక్కువ వేతనాలు కలిగిన కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, తక్షణమే సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని అంగన్వాడిలు, సిఐటియు నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికి వినతిపత్రం అందించారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు వెంకటలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు రామరాజు, పలువురు అంగన్‌వాడి యూనియన్ నాయకులు కలసి సమస్యలు వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేలు లోపు ఆదాయం వచ్చే వారికి అన్ని సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామని చెప్పూనే రూ.7వేలు వేతనాలు వస్తున్న మినీవర్కర్లకు, హెల్పర్లకు మాత్రం సంక్షేమ పథకాలు వర్తింపక చేయకపోవడం అన్యాయమన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్య ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజవొమ్మంగి సర్పంచ్ రమణి, అంగన్వాడి యూనియన్ నాయకులు కుమారి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయులను నియమించకుంటే ఆందోళన

ప్రజాశక్తి -సీలేరు : ఉపాధ్యాయులను తక్షణమే నియమించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన తప్పదని వెలుగురి రామారావు, విద్యార్థులు తల్లిదండ్రులు హెచ్చరించారు. జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ కొమ్ములవాడ, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో జూన్ నుంచి ఆగస్టు వరకు ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 40 మంది విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది గొర్రిలోవ పాఠశాలలో విధులు చేపట్టిన ఉపాధ్యాయురాలు వరలక్ష్మిని కొమ్ములవాడ డిప్యూటేషన్‌పై నియమించారు. ఇటీవల కౌన్సిలింగ్‌లో ఆమె బదిలీ కావడంతో ప్రస్తుతం ఉపాధ్యాయులు లేరు. శుక్రవారం కొమ్మలవాడ పాఠశాల ముందు విద్యార్థులు తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. తక్షణమే ఉపాధ్యాయుని నియమించాలని డిమాండ్ చేశారు.

ముంపు బాధితులకు 'అన్నదాత సుఖీభవ' ఇవ్వాలి

ప్రజాశక్తి - విఆర్‌పురం: రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ముంపు బాధితులకు నష్టపరిహారం ఇవ్వని భూములకు, 45 కాంటూర్‌లో ఉన్న గ్రామాలకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు పాయం లక్ష్మణరావు ఒక ప్రకటనలో కోరారు. విత్తనాలు ఇవ్వకుండా ఈ క్రాప్ బుకింగ్ చేయడానికి కూడా వీలు లేకుండా చేస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు వలన సర్వం నష్టపోతున్న వీరికి ఇప్పుడు పథకాలు కూడా నిలుపుదల చేయడం సరైన పద్ధతి కాదన్నారు. సమావేశంలో పోడియం రాజు, పాయం సుబ్బారావు మిడియం ముత్తయిలు పాయం వేంకటేశ్వరులు పాల్గొన్నారు.

నేడు అన్నదాత సుఖీభవ జమ

ప్రజాశక్తి-మారేడుమిల్లి: ఈ నెల 2వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని మండల వ్యవసాయాధికారి కె.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో అన్నదాత సుఖీభవ 6,024 మంది రైతులకు 301.2 లక్షలు రైతులకు జమ కానుందని తెలిపారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

ప్రజాశక్తి -సీలేరు: అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు వస్తుందని సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో ఎస్ ఇ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఎపి జెన్కో సీనియర్ అసిస్టెంట్‌గా అప్పలనాయుడు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఎపి జెన్‌కో కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి అప్పలనాయుడు దంపతులను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉద్యోగవిరమణ పొందడం అనేది సర్వసాధారణమని తాను సీలేరులో సంవత్సరం పైగా విధులు చేపట్టిన సమయంలో సీనియర్ అసిస్టెంట్‌గా అప్పలనాయుడు మంచి నడవడికతో చక్కటి పనితీరు కనబరిచే వారిని ప్రశంసించారు. ఆయన కుటుంబ సభ్యులుతో శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఐఎన్‌టియుసి రీజనల్ అధ్యక్ష కార్యదర్శులు వై. దాద్రాజు, ఆనంద్‌బాబు, మోతుగూడెం బ్రాంచి ప్రెసిడెంట్ ఈ దుర్గాప్రసాద్ సీలేరు బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు జి. సుకుమార్, కె.లామ ఎపి జెన్కో అకౌంట్ ఆఫీసర్ ఈవివి సత్యనారాయణ సబ్ ఇంజనీర్ శ్రీధర్ తదితరులు అప్పలనాయుడు సేవలను కొనియాడారు. ఎంపిటిసి సాంబమూర్తి, యూనియన్ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎపి జెన్‌కో ఇంజనీర్లు ఉద్యోగులు పాల్గొన్నారు.

అప్పలనాయుడును సన్మానిస్తున్న ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి

పార్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మండల కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: కూటమిప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్త, నాయకుడిపై ఉందని, పార్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే శిరీషదేవి పేర్కొన్నారు. స్థానిక వెంకటేశ్వర థియేటర్ ఆవరణలో శుక్రవారం పార్టీ మండలకమిటీ ఎన్నిక నిమిత్తం నాయకులు, పార్టీ మండల కార్యదర్శి ముప్పన డింబకేశ్వరరావు అధ్యక్షతన టిడిపి కార్యకర్తలు, బూత్,క్లస్టర్, యూనిట్ ఇంఛార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషదేవి మాట్లాడుతూ ఎవరి ప్రమేయం లేకుండా మండల అధ్యక్షులు, పార్టీ కార్యవర్గం ఎన్నిక జరగాలన్నారు. ఎవరు పార్టీ కోసంకష్టపడి పని చేస్తారో, అటువంటి వారిని, సరైన వ్యక్తిని టిడిపి మండల అధ్యక్షులుగా ఎన్నుకోవాలని సూచించారు. పోటీలేకుండా ఏకాభిప్రాయంతో ఎన్నిక జరిగితే సంతోషం అన్నారు. టిడిపి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రత్యేకంగా రాజవొమ్మంగి మండలంలో పార్టీకి పూర్వవైభవం తీసుకురాడానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల అధ్యక్ష పదవికోసం గొల్లపూడి పెద్దిరాజు, గణజాల తాతారావ్ పోటీ పడడంతో సీక్రెట్ ఓటింగ్ నిర్వహించి సీల్డ్‌కవర్ అధిష్టానానికి పంపి అక్కడి నుండి ప్రకటించిన వారిని అధ్యక్షులుగా నిర్ణయించడం జరుగుతుందని నియోజకవర్గ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకులు రమేష్, టిడిపి జిల్లా నాయకులు శివరామచంద్రరాజు, ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎంపిటిసి నల్ల సత్యనారాయణ. ఎఎంసి కమిటీ సభ్యులు శివ, పార్టీ నాయకులు సావిత్రి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెసి అభిషేక్ గౌడ

ప్రజాశక్తి-పాడేరుటౌన్: బిడ్డల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లి పాలు తప్పనిసరి అని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ అన్నారు. తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, డిఆర్ఓ కె.పద్మలత, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి విశ్వేశ్వర నాయుడు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి సిహెచ్ యూన్స్ రామ్ పడాల్ తో కలసి గోడ పత్రిక విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన గంట లోపే తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలని, ముర్రు పాలు బిడ్డకు మొదటి సహజ టీకా అని తెలిపారు. ఇందులో ఉండే ప్రోటీన్స్, ఫ్యాటీ యాసిడ్స్, లాక్టోజ్, విటమిన్స్, ఇమ్యూనోగ్లోబులిన్స్ బిడ్డల సంపూర్ణ ఎదుగుదలకు, రోగనిరోధక వ్యవస్థ బలపడటానికి తోడ్పడతాయన్నారు. వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయన్నారు. బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యవంతంగా ఉంటుందని బిడ్డకు, తల్లికి అనుబంధం బలపడి బిడ్డ మానసిక, శారీరక అభివృద్ధికి తోడ్పడునని తెలియజేశారు. బిడ్డకు పాలు పట్టే విధానం, జాగ్రత్తలు, చేతుల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

జి మాడుగుల: అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు, బాలింతలకు పౌష్టిక ఆహార కిట్లను ఎంపీపీ ఎల్ ఉషారాణి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సోమేలి చిట్టిబాబు, సిడిపిఓ మణిదేవి చేతుల మీదగా అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు

ఔషధ వినియోగంలో అప్రమత్తత

గీతంలో డిసిఎ సహాయ డైరెక్టర్ విజయ్‌కుమార్

మాట్లాడుతున్న డిసిఎ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి-మధురవాడ : ప్రజారోగ్య సంరక్షణలో ఔషధాల పాత్ర కీలకమని రాష్ట్ర ప్రభుత్వ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) సహాయ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. నిషేధిత ఔషధాలను, అవసరం లేకపోయినా యాంటీబయాటిక్‌ల వాడకం వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఫార్మసిస్టులపై ఉందన్నారు. శుక్రవారం . గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సును ప్రారంభించి మాట్లాడుతూ, సహజ సిద్ధమైన ఔషధ వినియోగం నుంచి సింథటిక్ ఔషధాల వినియోగం ఎలా అభివృద్ధి చెందిందో వివరించారు. వైరల్ ఇన్‌ఫెక్షన్‌లకు యాంటీబయాటిక్‌లు వాడకం ప్రమాదకరమని, శరీరంలోని రోగనిరోధక శక్తి తగ్గిపోతుందన్నారు. ఫార్మసిస్ట్‌లు నైతిక బాధ్యతగా ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా ఔషధాలను అందించాలన్నారు. డిసిఎ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ కృత్రిమ మేధ ఫార్మశీ, వైద్య ఆరోగ్య రంగంలో పెను మార్పులపై అవగాహన అవసరమన్నారు.. గీతంలో ఫార్మశీ పరిశోధనలను స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ వివరించారు. డాక్టర్ జి.సౌజన్య సంధాన కర్తగా వహించారు.

రైతులకు ఉపాధి కల్పించాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆందోళన

వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలం బొండం పంచాయతీ మజ్జివలస గ్రామంలో ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులను ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అరకులోయ మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. అనంతరం రెవెన్యూ ఇన్స్పెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి జి బుజ్జిబాబు, మండల ఉపాధ్యక్షుడు కె.రామారావు మాట్లాడుతూ, ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులను ఉపాధి అవకాశాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి సుమారు 18.5 ఎకరాలు రైతులు సాగులో ఉన్న భూములు ఇచ్చిన 16 మంది గిరిజనులను ఉద్యోగ అవకాశాలు కల్పించి, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి తీరా ఆ మాటలేదన్నారు. దీనిపై స్పందించిన ఆర్ఐ గ్రామసభ పెట్టి భూమి కోల్పోయిన రైతులను న్యాయం చేసే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మజ్జివలస భూ బాధితులు జి.పరశురామ్, ఎం ఇందోర్, జి రమేష్, పి.అప్పలరాజు, కె,నాగమణి, బుద్రి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్లతో ఆన్‌లైన్ పనులు చేయలేం

అంగన్వాడీ యూనియన్ నాయకులు

అంగన్వాడీ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఈనెల 5 నుండి ఫోన్లలో ఆన్‌లైన్ పనులు చేయలేమని అంగన్వాడి కార్యకర్తలు శుక్రవారం అరకులోయ మండల సిడిపిఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ, అంగన్వాడీలు కేంద్రాల్లో హాజరయ్యే లబ్దిదారులకు ఆహారం, సరుకులు పంపిణీ మొత్తం రికార్డులో పొందుపరుస్తామని తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, కొత్తగా మాతృ వందనం పథకం అమలు చేయలేమన్నారు. అంగన్వాడీ సెంటరు నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పోషణ ట్రాకరు, బాలసంజీవిని యాప్లు అమలుకు సపోర్ట్ చేయడం లేదని చెప్పారు. లబ్దిదారులుకు ఫోటో క్యాప్చర్, ఓటిపి, ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన అమలు చేయడానికి అంగన్వాడీలు టీచర్స్, వర్కర్స్ అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సరుకులు అన్ని ఒక్కసారి గా రాలేదని, నెట్ సిగ్నల్ పనిచేయకపోవడంతో లబ్దిదారులందరూ ఇబ్బందులు పడుతున్నారని స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి మాతృ వందనం పథకాన్ని కొత్తగా అంగన్వాడీలకు అప్పగించరాదన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనాలు పెంచాలని, మినీ అంగన్వాడీ వర్కర్లను మెయిన్ వర్కర్లు గా మార్చుతూ జీవో ఇవ్వాలని, గ్రాడ్యుటి జీవోలో మార్పులు చేయాలని, హెల్పర్లు ప్రమోషన్ లకు గైడ్లైన్స్ రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు డి.నాగమ్మ, డి నిర్మల, ఆర్.రాధభారతి, పి.వెంకటలక్ష్మీ, కె.లక్ష్మి, టీ గౌరమ్మ పాల్గొన్నారు.

బలగరువు రోడ్డు పనులకు టెండర్

గిరిజనుల ఆందోళనకు స్పందించిన ప్రభుత్వం

ప్రజాశక్తి అనంతగిరి: మండలంలోని పీఎం జన్మన్ పథకం కింద మంజూరైన పిన్నకోట పంచాయతీ పరిధి బలగరువు రోడ్డు పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యిందని ఈనెల నాలుగో తేదీన పనులు పున్ణప్రభిస్తామని పిఆర్ శాఖ ఏఈ గణేష్ వెల్లడించారు.

పినకొట, పెదకొట, జీనబాడు ఈ మూడు పంచాయతీల పరిధి. బల్లగరువు, వాజంగి, పీసుమామిడి, గుమ్మంతి, గుర్రబయలు, రాచకిలం, కోట్లగరువు, రెడ్డిపాడు, కరకవలస, తదితర 12 కిలోమీటర్లకు 11 కోట్ల 66 లింకురోడ్డు పనులు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని ఈనెల నాలుగో తేదీన పనులు మొదలుపెట్టబోతున్నామని తెలిపారు. అడవి తల్లి బాటలో భాగంగా పీఎం జన్మన్ పథకం కింద మండలంలో 8 పనులు మంజూరు కాగా ఇందులో నాలుగు పూర్తి అయ్యాయన్నారు. బల్లగరువు రోడ్డు పనులు చేపట్టాలని గ్రామస్తులు నిరసన చేపట్టగా కలెక్టర్ ఆదేశాలతో పనులు మొదలు పెడుతున్నట్లు తెలిపారు. సింగర్భ, దాసరితోట పనులకు టెండర్ పిలవడం జరిగిందని, ఇప్పటికి ఫైనల్ కాలేదని మూడవసారి టెండర్ ప్రక్రియ పిలవడం జరుగుతుందన్నారు,

నేరాలు ఘోరాలు

నాటుసారా పులుపును పట్టుకున్న ఎక్సైజ్, పోలీసులు

సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ పరిధిలోని రాతులపుట్టు గ్రామంలో పాడేరు డీఎస్పీ ఉత్తర్వుల మేరకు శుక్రవారం స్థానిక పోలీస్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. 5000 లీటర్ల నాటుసారా పులుపును గుర్తించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్‌శాఖ అధికారులు మాట్లాడుతూ, నాటుసారా తయారీ, విక్రయం, వినియోగం చట్టరీత్య నేరం అని స్పష్టం చేశారు. ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీస్ శాఖ కఠినంగా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

సమస్యలపై వినతి

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలుగుదేశం సమన్వయకర్త సీతంరాజు సుధాకర్ కోరారు. శుక్రవారం కార్పొరేటర్లు ఉరుకుటి నారాయణరావు, విల్లూరి భాస్కర రావు, గొలగాని వీరరావు (బుజ్జి), గోడి పద్మావతి, కోడూరు అప్పలకొండమ్మలతో కలిసి జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో మంచినీటి కుళాయి నీరు కలుషితమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి సిసి కెమెరాలు ఏర్పాటుచేయాలని కోరారు. పోర్టు కాలుష్యం సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 8లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ నెల 8 లోపు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి దరఖాస్తులు పంపించాలని తెలిపారు.

పేటెంట్ ఫైలింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి- వేపగుంట : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో 'ఫ్యూయలింగ్ ఇండియా, ఇన్నోవేషన్ ఇంజిన్' అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్‌డిసి) డిప్యూటీ మేనేజర్, పేటెంట్ ఏజెంట్ ప్రీతి నిహారిక మాట్లాడుతూ, విద్యార్థుల ఇన్నోవేటివ్ ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో అభివృద్ధి చేసి, పేటెంట్ ఫైలింగ్ విధానం ద్వారా ఎలా పబ్లిష్ చేయాలో వివరించారు. అలాగే స్టార్టప్‌లను ప్రారంభించడానికి అవసరమైన ప్రాథమిక దశలు, వ్యాపార ప్రణాళిక సిద్ధం చేయడం, మార్కెటింగ్ వ్యూహాలు వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జి. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జివి.ప్రదీప్ వర్మ, ఇఐఎస్ఐ కోఆర్డినేటర్ చందన, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పి ధరలకే ఎరువులు విక్రయించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని వ్యవసాయ శాఖ ఎడి సావిత్రి ఆదేశించారు. స్థానిక గ్రోమోర్ సెంటర్ ను ఏడి సావిత్రి శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. రంపచోడవరం డివిజన్‌లో అన్ని మండలాల్లో ఎరువులు రైతుసేవా కేంద్రాల్లో డీలర్స్ వద్ద సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి చక్రధర్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - చింతూరు : పంచాయతీ కార్మికుల వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన లక్ష్మణ్ మాట్లాడుతూ మండలంలో పంచాయతీ కార్మికులకు వేతనాలతో పాటు యూనిఫామ్స్, గ్లౌజులు, మాస్కులు. ఇవ్వాలన్నారు. సమావేశంలో సిఐటియూ నాయకులు చింత రాంబాబు. పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సిడిపిఓగా సుజాత

సిడిపిఓ సుజాత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ఐసిడిఎస్ సిడిపిఓగా సుజాత శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సుజాత విశాఖపట్నం పెందుర్తి ఐసిడిఎస్ కార్యాలయంలో గ్రేడ్-1 సూపర్‌వైజర్‌గా పనిచేసి పదోన్నతిపై ఐసిడిఎస్ సిడిపిఓగా శుక్రవారం విధుల్లో చేరారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన సిడిపిఓ దేవమణి కొయ్యూరు బదిలీపై వెళ్లారు. శుక్రవారం విధుల్లో చేరిన సిడిపిఓ సుజాతను కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సిఐ గోపాలకృష్ణకు ఘన సన్మానం

ప్రజాశక్తి -వి.ఆర్.పురం : చింతూరు సిఐ గోపాలకృష్ణను జర్నలిస్టు వై. నాగేంద్రబాబు, ఎం.సత్యనారాయణ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీలో మంచి సేవలు అందించాలని మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలని, శాంతిభద్రతలు పరిరక్షించి అందరి మన్ననలు అందుకోవాలన్నారు. అనంతరం ఆయనను పాస్టర్ ఏసురత్నం ఘనంగా సన్మానించారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడవలసిన బాధ్యతతో పాటు, భూ సంబంధ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్, అడిషనల్ డైరెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ విసి సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌తో అందరికీ ఇండ్లు, రీ - సర్వే, ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణ, పిజిఆర్ఎస్,ఎస్సీ బర్రియల్ గ్రౌండ్స్ , కులధ్రువీకరణ పత్రాల జారీ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీ-సర్వేను వేగవంతం చేసేందుకు గ్రామ,మండల సర్వేయర్లు రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తహశీల్దార్లు మరింత ఉత్సాహంగా పనిచేయాలన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి సొంతిల్లు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తహశీల్దార్లు లే అవుట్‌లను పరిశీలించాలన్నారు.

ఐఐఎంం బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో 'అడ్మిషన్స్ ఆన్ వీల్స్'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: విద్యార్థులకు నాణ్యమైన మేనేజ్‌మెంట్, టెక్నాలజీ విద్యను మరింత చేరువ చేసేందుకు ఐఐఎంం బిజినెస్ స్కూల్ 'అడ్మిషన్స్ ఆన్‌వీల్స్' పేరిట వినూత్న కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బాల్‌మోహన్‌దాస్ మాట్లాడుతూ ఈ మొబైల్ అడ్మిషన్ క్యాంపెయిన్ భారతదేశంలోనే తొలి ప్రయత్నమని, దీని ప్రధాన లక్ష్యం ఉన్నత విద్య అవకాశాలను విద్యార్థులకు వారి గుమ్మం దాకా తీసుకెళ్లడమే అన్నారు. ఐఐఎంం డీన్‌అండ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.పి.రవీంద్ర మాట్లాడుతూ తమ సంస్థ 1987 నుండి విద్యారంగంలో తనదైన ముద్రవేసిన , విద్యార్థులలో నైపుణ్యాలను మెరుగుపరుస్తూ ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఐఐఎంం బిజినెస్ స్కూల్ డైరెక్టర్ జనరల్, ఎయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

రామవరంలో పింఛన్ ఇస్తున్న సిపిఎం నాయకులు

విఆర్‌పురం: పింఛన్లు అందిస్తున్న సిపిఎం నాయకులు

మారేడుమిల్లిలో పింఛన్ ఇస్తున్న కూటమి నాయకులు

కూనవరంలో పింఛన్ ఇస్తున్న సర్పంచ్ నాగమణి

పాడేరుటౌన్ : పింఛను అందజేస్తున్న జెసి అభిషేక్‌గౌడ్

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలంలో రామవరం పంచాయతీలో శుక్రవారం ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ కారం బుచ్చమ్మతో పాటు సిపిఎం నాయకులు ఐదు కొత్తపింఛన్లు అందించారు. కోప్పల్లి సోయం రాజమ్మ, తెల్లం సుబ్బమ్మ, గోల్కొండ సత్యవతికి పింఛన్లు అందించారు. రేఖపల్లి, ఉమ్మడివరం అన్నవరం గ్రామంలో సర్పంచ్ పూనం సరోజినీ, ఎంపిటిసి బంధం విజయలక్ష్మి ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందించారు. కార్యక్రమంలో సిపిఎం మండలవర్గ సభ్యులు కారం సుందరయ్య, కమ్ము చిచ్చు సత్యనారాయణ, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని పెద్దఆర్కూర్ పంచాయతీ పరిధిలోని పెద్దఆర్కూర్ గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. సర్పంచ్ నాగమణి, ఎంపిటిసి అమ్మాజి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు.

మారేడుమిల్లి: మారేడుమిల్లి గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. కొత్తగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గురుకు శేషుకుమార్, జనసేన మండల అధ్యక్షులు మల్ల దుర్గాప్రసాద్ కూటమి నాయకులు పాల్గొన్నారు..

రాజవొమ్మంగి: మండలంలోని దూసరిపాము, రాజవొమ్మంగి గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఇటీవల కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, మండలపార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు, డింబ కేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరుటౌన్: మండలంలోని మినుములూరు గ్రామంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్‌గౌడ్ శుక్రవారం పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఈ నెల 1824 మందికి కొత్తగా వితంతు పెన్షన్స్ మంజూరయ్యాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కనీస పింఛను రూ.4వేలు అందించడం జరుగుతుందన్నారు. ఎన్ టిఆర్ భరోసా పింఛన్‌ల కింద వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు, కదలలేని స్థితిలో ఉన్నవారికి, తదితర అన్ని రంగాలకు చెందిన వారికీ కనీస పింఛను నాలుగు వేల రూపాయలు కాగా గరిష్టంగా పదిహేను వేల వరకు అందించడం జరుగుతుందని చెప్పారు. పేదల సేవలో భాగంగా జిల్లాలో 1,23,046 మందికి రూ.51.78 కోట్లు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ పథక సంచాలకులు వి.మురళీ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో 11వ సారి జిల్లాలో ఫస్ట్

పింఛన్ పంపిణి కార్యక్రమంలో జూలై నెల పంపిణిలో మారేడుమిల్లి మండలం జిల్లాలో 98 శాతం పంపిణీ చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి మరోసారి వార్తల్లోకెక్కింది. గత పది నెలల నుంచి వరుసగా పింఛన్ పంపిణిలో మండలం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడమే కాకుండా 11వ సారి కూడా రికార్డు కెక్కింది. ఎంపిడిఓ తూతిక శ్రీనివాసవిశ్వనాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది మొదటిరోజే రికార్డు స్థాయిలో 98 శాతం పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.

ఆ గ్రామాలకు వెళ్లాలంటే వాగు దాటాల్సిందే..

వాగు దాటుతున్న అంగన్వాడీ కార్యకర్త

ప్రజాశక్తి-సీలేరు: జికెవీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ హరిపురం జీనేరేడుపల్లి రాళ్లగెడ్డ తదితర సుమారు 6 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడానికి వాగు దాటి వెళ్లక తప్పడం లేదు. ఆయా గ్రామాల నుంచి ఈ వాగు దాటి పంచాయతీకి వెళ్లడానికి ఐదు కిలోమీటర్ల దూరం నడవాల్సి ఉంది. దుప్పిలివాడ, దారకొండ, గుమ్మిరేవులు గుమ్మరేవులు, అగ్రహారం కుమ్మరపల్లి మీదుగా 15 కిలోమీటర్లు దూరం చుట్టూ తిరిగి కాలినడకన వెళ్ళవలసి వస్తుంది. ఇటువంటి గ్రామాలు మండల కేంద్రం పరిధిలో ఏ.దారకొండ పంచాయతీ నడిమివీధి, గొల్లపల్లి, గాలికొండ పంచాయతీ జాజిపాకల బత్తునూరు గ్రామాల పరిధిలో పెద్దపెద్ద వాగులు వర్షం వస్తే పొంగి ప్రవహిస్తున్నాయి. ఆయా గ్రామాలు ప్రజలు నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు, వైద్యసేవలు పొందేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం హరిపురం అంగన్వాడీ కార్యకర్త బియ్యం మూట నెత్తిన పెట్టుకుని వాగు దాటి వెళ్లాల్సి వచ్చింది. వర్షం కురిస్తే ఇటువంటి ఇబ్బందులు తప్పడం లేదని ఆమె వాపోయింది. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆయా వాగుల వద్ద వంతెనల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి

దారకొండ దుప్పిలివాడ, గుమ్మిరేవులు గాలికొండ, ఏ.దారకొండ పంచాయితీ పరిధిలో వాగులపై వంతెనలు నిర్మించకపోవడంతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి వాగులపై వంతెనలు నిర్మించి చర్యలు చేపట్టాలి.

- అంపరంగి బుజ్జిబాబు, గాలికొండ ఎంపిటిసి, సిపిఎం

హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు

- 17 కేసులు నమోదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని హోటల్లు, రెస్టారెంట్లు, డాబాల్లో ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 20 బృందాలుగా ఏర్పడి 42 శాంపిల్స్ సేకరించారు. ఫ్రిజ్‌ల్లో నిల్వ ఉంచిన ఆహారాలు పాడైనట్లు గుర్తించి 17 కేసులు నమోదు చేయడం జరిగిందని జాయింట్‌ఫుడ్ కంట్రోల్ అధికారి ఎన్. పూర్ణచంద్రరావు మీడియాకి తెలిపారు. సేకరించిన శాంపిల్స్‌ను విజయవాడలోని స్టేట్‌ఫుడ్ లాబరేటరీకి ఎనాలసిస్ నిమిత్తం పంపుతున్నామన్నారు.

అక్కడి నుంచి వచ్చిన రిపోర్ట్ ఆధారంగా కూడా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. జగదాంబ జంక్షన్‌లోని ఆల్ఫాహోటల్‌లో తనిఖీలు నిర్వహించి వంటల్లో ఎక్కువగా కలర్స్ ఉపయోగిస్తున్నట్లు, ఫ్రిజ్‌లో నిల్వచేసిన ఆహారం పాడైనట్లుగా గుర్తించామని ఆయన చెప్పారు.

29 నుంచి విశాఖ వేదికగా ప్రో కబడ్డీ లీగ్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: కబడ్డీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్ వచ్చేస్తోంది. ఆగస్టు 29న న విశాఖపట్నం వేదికగా ప్రారంభం కానుంది. విశాఖపట్నంతో పాటు జైపూర్, చెన్నై, ఢిల్లీ వేదికలగా నిర్వహించనున్న ఈ పోటీల్లో 12 జట్లు తలపడనున్నాయని ప్రో కబడ్డీ లీగ్ కమిషనర్ అనుపమ్‌గోస్వామి తెలిపారు. శుక్రవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ 12వ సీజన్ ప్రారంభ వేడుకలు వైజాగ్‌లోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో అట్టహాసంగా జరగనున్నాయి. ఆగస్టు 29 శుక్రవారం జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్‌తో తలపడనుందన్నారు. అదే రోజు జరిగే రెండో మ్యాచ్‌లో బెంగళూరుబుల్స్, పుణేరి పల్టాన్‌ను ఢీకొట్టనుంది. ఆగస్టు 30న, తెలుగు టైటాన్స్ యూపీ యోధాస్‌తో , ఆ తర్వాత జరిగే మ్యాచ్‌లో యుముంబా, గుజరాత్ జెయింట్స్‌తో తలపడనుంది. ఇక సూపర్ సండే ఆగష్టు 31 న తలైవాస్, యు ముంబా మధ్య జరగనుండగా, డిఫెండింగ్ చాంపియన్ హర్యానా స్టీలర్స్ తమ టైటిల్ వేటను బెంగాల్ వారియర్స్ మ్యాచ్‌తో ప్రారంభించనుంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత పీకేఎల్ మళ్లీ వైజాగ్‌కు రావడం విశేషం. గతంలో 2018లో ఆరో సీజన్‌కు అంతకుముందు 1,3వ సీజన్ పోటీలకు అతిథ్యం ఇచ్చింది. ఇప్పుడు మళ్ళీ కబడ్డీ సందడి నెలకొననుంది. మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. జియో హాట్‌స్టార్ లో లైవ్ స్ట్రీమ్ అవుతాయి.

జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 20 వినతులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: మహావిశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కి సంబంధించి 20 వినతులు వచ్చాయని జివిఎంసి చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ఆయన చాంబర్‌లో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, ప్రతి శుక్రవారం జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.